క్లుప్తంగా

8న శ్రీరామలింగేశ్వరస్వామి వార్షిక కల్యాణం

నున్న(విజయవాడరూరల్): మహాశివరాత్రి పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీన నున్న గ్రామంలోని గంగాపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం రాత్రి ఏడు గంటలకు స్వామివారి దేవస్థానంలో నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకాశీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి వేకువజామున నాలుగు గంటల నుంచి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష అర్చనలు నీరాజన మంత్రపుష్పం జరుగుతుందని చెప్పారు. రాత్రికి లింగోద్భవ కాలంలో స్వామివార్లకు మహారుద్రాభిషేకం జరుగునని ఆమె తెలియజేశారు.

రహదారి మరమ్మతుల్లో నిబంధనలు పాటించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో జాతీయ రహదారి మరమ్మతుల పనులు నిబంధనల మేరకు నిర్వహించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు హెచ్చరించారు. స్థానిక విజయవాడరోడ్డులో జరుగుతున్న మరమ్మతుల పనులను ఎన్‌హెచ్‌ఏఐ రెసిడెంట్ కం హైవే ఇంజినీర్ పి.సుధీర్‌కుమార్, హైవే ఇంజినీర్ ఎంవీ నాగేశ్వరరావులతో కలిసి మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రోడ్డుపై తారు తొలగించి రోజుల తరబడి కొత్త రోడ్డు వేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించడం పట్ల సుబ్బరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు ఎత్తు, పల్లాలు లేకుండా ఏకరీతిగా వేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని పక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని హైవే ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టు సంస్థకు చెందిన ప్రాజెక్టు ఇంజినీర్ అశ్వినిపాత్రోకు తెలిపారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



పెనమలూరు: పోరంకి వాసవి క్లబ్ నవనిర్మాణ్ కపుల్స్ ఆధ్వర్యంలో మంగళవారం విజ్ఞాన్ భారత్ పాఠశాలలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. వాసవి క్లబ్ జోన్ చైర్మన్ కారంశెట్టి వెంకటమస్తానయ్య మాట్లాడుతూ త్రినేత్ర కంటి ఆస్పత్రి సహకారంతో విద్యార్థులకు కంటి పరీక్షలు చేయించామన్నారు. అవసరమైన విద్యార్థులకు కళ్ల జోళ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు రాజమడుగు లక్ష్మీమానస, ట్రెజరర్ కారంశెట్టి శైలజ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నూర్‌బాషాలకు అవకాశం ఇవ్వాలి

కంకిపాడు: వచ్చే ఎన్నికల్లో నూర్‌బాషాలకు అవకాశం ఇవ్వాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన ఈడుపుగల్లులో విలేకరులతో మాట్లాడారు. తాడేపల్లిలో సోమవారం జరిగిన నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి వినతిపత్రం అందించామన్నారు. నూర్‌బాషాలు నేటి వరకూ అసెంబ్లీలోకి ప్రవేశించలేదన్నారు. జనాభా ప్రాతిపదికన నూర్‌బాషాలకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు. తనతోపాటు సంఘం మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ మాబిని, రాష్ట్ర కార్యదర్శి షేక్ మీరాబి, జిల్లా అధ్యక్షురాలు షేక్ రంజాన్ బీ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు షేక్ కరిష్మాబీ పాల్గొన్నారని వివరించారు.

ఇంటి వద్దనే పోలియో చుక్కలు



నున్న(విజయవాడరూరల్): వివిధ కారణాలతో ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో పోలియో చుక్కలు తీసుకోని పిల్లలకు సోమ, మంగళవారాల్లో వైద్య సిబ్బంది ఇంటి వద్దకు వెళ్లి వేశారు. వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పల్స్ పోలియో సందర్భంగా విజయవాడరూరల్ మండలంలో 7,779 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయగా, ఈ రెండు రోజుల్లో 143 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్టు నున్న ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ తెలిపారు.

8న మోకాళ్ల నొప్పులకు ఉచిత వైద్య శిబిరం

పెనమలూరు: మోకాళ్ల నొప్పులకు ఉచిత వైద్య శిబిరం ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తున్నామని యోగాశక్తి సాధన సమితి చైర్మన్ మాకాల సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు తెలుపుతూ 8న కానూరు అశోక్‌నగర్ ఇండియన్ ఓం కార్యాలయంలో వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. మందులు వాడకుండా, ఎటువంటి ఆపరేషన్ లేకుండా యోగాశక్తి ఆక్యుపంక్చర్ విధానంతో అవగాహన కల్పించి చికిత్స చేస్తామని వెల్లడించారు. భవిష్యత్తులో కూడా మోకాలు నొప్పులు రాకుండా సలహాలు కూడా ఇస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9000347369 నంబర్‌ను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

గుండె.. పదిలం

- కంకిపాడు సీహెచ్‌సీలో అత్యవసర వైద్యం
- ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్ యూనిట్ ఏర్పాటు
- ప్రభుత్వ చర్యలతో ప్రజలు హర్షాతిరేకం



కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం

కంకిపాడు: గుండెపోటుతో ఊపిరి ఆగిపోతుంది. ఇటీవల నాలుగు పదుల వయస్సులోనే గుండెపోటుతో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గుండెను పదిలంగా కాపాడి ప్రాణాలను రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధాన ఆస్పత్రుల్లో గుండె సంబంధ వైద్య సేవలను సమర్థవంతంగా అందించేందుకు చర్యలు తీసుకుంది. వైద్య సేవలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.


ఇదీ కదా.. అభివృద్ధి

కంకిపాడులో ఎమర్జెన్సీ కేర్ యూనిట్..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలోనూ ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. సీహెచ్‌సీని రూ. 4.60 కోట్లతో అధునాతన వసతులతో నిర్మించి వైద్యసేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. దీంతో పాటుగా తాజాగా కార్డియాక్ కేర్ యూనిట్ ఏర్పాటు చేశారు. గుండె నొప్పి వచ్చిన వెంటనే గంట లోగా కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుంటే అక్కడి సిబ్బంది గుండెనొప్పి నిర్ధారణకు సంబంధించిన ఈసీజీ, ఇతర నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. రక్తనాళాల్లో రక్తం గడ్డ గట్టినట్లుగా గుర్తిస్తే ప్రాథమిక వైద్యసేవలు అందించి గుండె శస్త్రచికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తారు. ఈ ప్రక్రియ ద్వారా గుండెపోటు కారణంగా ప్రాణాలు పోకుండా కాపాడుకోవచ్చు.

రూ. 50 వేల విలువ గల ఇంజక్షన్లు..

గుండెపోటు అని నిర్ధారణ అయి, గుండెకు రక్త ప్రసరణ చేసే రక్తనాళాల్లో గడ్డలు ఉన్నట్లు అయితే గంట లోగా రోగికి చికిత్స ప్రారంభించాల్సి ఉంది. టెనెక్టీప్లేస్ అనే ఇంజక్షన్ రక్తనాళాల్లోని గడ్డలను కరిగించి ప్రాణాపాయం లేకుండా చేస్తుంది. ప్రస్తుతం ఈ ఇంజక్షన్లు కంకిపాడు సీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం రెండు ఇంజక్షన్లను ఆసుపత్రిలో భద్రంగా ఉంచారు. వీటి విలువ ఒక్కొక్కటి రూ. 50 వేలు అని వైద్యులు పేర్కొంటున్నారు. అత్యంత ఖరీదైన వైద్యం సైతం సమర్థంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అత్యవసర వైద్యసేవలు స్థానికంగా అందుబాటులోకి రావడం పట్ల ఇక్కడి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గుండెనొప్పి నిర్ధారణ అనంతరం రోగికి అందించే ఇంజక్షన్

అందుబాటులో వైద్యం



అత్యవసర గుండె వైద్యం కంకిపాడులో అందుబాటులో ఉంది. గుండెపోటు అని నిర్ధారణ అయితే వెంటనే టెనెక్టీప్లేస్ ఇంజక్షన్ అందిస్తాం. ప్రస్తుతం రెండు ఇంజక్షన్‌లు ఉన్నాయి. అవసరం మేరకు జిల్లా ప్రధాన ఆసుపత్రి నుంచి తెప్పించుకునేందుకు అవకాశం ఇచ్చారు. ఆలస్యం చేయకుండా సమస్య తలెత్తిన వెంటనే ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలి. తద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు.

– డాక్టర్ ఎం.సంజయ్, సూపరింటెండెంట్, కంకిపాడు సీహెచ్‌సీ

వైద్య రంగానికి పెద్దపీట



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. ఒకప్పుడు జిల్లా కేంద్రాలు, ప్రధాన ఆసుపత్రుల్లోనే ఈ తరహా వైద్యం అందేది. కానీ సీఎం జగనన్న ప్రభుత్వం ఉత్తమ ప్రమాణాలతో కూడిన వైద్యం గ్రామీణ ప్రాంత ప్రజలకూ అందజేస్తోంది. ప్రజలందరూ ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

–మేదంద్రావు కుటుంబరావు, సీహెచ్‌సీ చైర్మన్

సీఎం జగన్‌కు అండగా ఉందాం

పెనమలూరు: ప్రజల సంక్షేమానికి అహర్నిశలు పాటు పడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో మద్దతుగా నిలుద్దామని తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్ కుమార్ అన్నారు. కానూరు మురళీనగర్‌లో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో సీఎం జగనన్న ఇచ్చిన హామీలు దాదాపు 90 శాతం అమలు చేశారన్నారు. ప్రధానంగా నవరత్నాలు అన్నీ అమలు చేసి ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు. నేడు జగనన్న పాలనలో విద్యార్థులు, రైతులు, వృద్ధులు, మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు అధికారంలోకి రావడానికి కుట్రలు చేస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆ కుట్రలు తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వేమూరి బాలకృష్ణ, అంగిరేకుల సీతారామయ్య, తుమాటి శ్రీరాములు, కాకర్ల సుబ్బరాజు పాల్గొన్నారు.



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, నేతలు

నేడు పీవీపీ సిద్ధార్థలో సితార్ 2కె 24

పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం జాతీయ స్థాయిలో సితార్ 2కె 24 కార్యక్రమం నిర్వహిస్తున్నామని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు తెలిపారు. కాలేజీలో మంగళవారం ఆయన విలేకరులకు వివరాలు తెలుపుతూ శాస్త్ర, సాంకేతిక, సాంస్కృతిక రంగాలపై బుధవారం సితార్ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి రెండు వేల మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. టెక్నికల్ పేపర్ ప్రజంటేషన్‌తో పాటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నాలుగు లక్షల ప్రైజ్ మనీ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నై ఫిలిప్స్ జనరల్ మేనేజర్ శంకర్‌విశ్వనాథన్ పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కౌన్సిల్ సభ్యులు నున్న రాక

విజయవాడరూరల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించేందుకు బుధవారం నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీమ్ కౌన్సిల్ సభ్యులు నున్న గ్రామానికి వస్తున్నారని ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. నున్న గ్రామంలో జాతీయ ఉపాధిహామీ పథకంలో రైతుల పొలాల్లో భూగర్భ జలాల కోసం నీటికుంటల తవ్వకం, జగనన్న కాలనీలో జరుగుతున్న పనులు, ప్రభుత్వ పరంగా నిర్మించిన భవనాలను కౌన్సిల్ సభ్యులు పరిశీలిస్తారని తెలిపారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

రామవరప్పాడు: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తెలిపారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో మంగళవారం జాతీయ రహదారితో పాటు ప్రధాన గ్రామంలో సైడు డ్రెయిన్లకు పూడిక తీయించి, చెత్తను తొలగించారు. రామ్మోహనరావు మాట్లాడుతూ జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, హైవేపై పారిశుద్ధ్యం మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. పారుదలకు నోచుకోని డ్రెయిన్లను గుర్తించి పూడిక తీయిస్తున్నామన్నారు. అంతర్గత రహదారుల్లోని చెత్త, వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బందితో తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఖాళీ స్థలాలు, మురుగునిల్వ ఉన్న ప్రాంతాలు, అంతర్గత రహదారుల్లో దోమల మందు పిచికారి చేయించి బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు వివరించారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం



పొట్టిపాడు జగనన్న సురక్ష శిబిరంలో ఎంపీపీ సరోజిని



గొడవర్రు జగనన్న సురక్ష శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉంగుటూరు: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు దోహదపడతాయని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. పొట్టిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న సురక్ష శిబిరాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. గతంలో ఎన్నడు లేనివిధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 5లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీని రూ. 25లక్షలకు పెంచిందని పేర్కొన్నారు. అనంతరం వైద్య శిబిరంలో మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కత్తుల జ్యోతి, ఎన్‌ఏపేట సర్పంచ్ నాగరాజు, ఈఓఆర్‌డీ బాషా, కార్యదర్శి అప్పారావు, డాక్టర్ మనోహర్‌రెడ్డి, డాక్టర్ సుష్మా, డాక్టర్ కార్తిక్, డాక్టర్ ఎస్.మల్లిఖార్జునరావు, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంకిపాడు: మండలంలోని గొడవర్రు గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం జరిగింది. శిబిరాన్ని సర్పంచ్ విజయ చంద్రశేఖర్ ప్రారంభించారు. సాధారణ వ్యాధులు, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ నికిత, ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్, ఎంపీటీసీ నిర్మలజ్యోతి, ఈఓ శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోరంకిలో జగనన్న ఆరోగ్య సురక్ష

పెనమలూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ వైద్య సేవలు అందుతాయని పెనమలూరు వైద్యురాలు సాయిలలిత అన్నారు. పోరంకిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని జగనన్న సురక్ష ద్వారా వైద్య సేవలు అందిస్తోందని తెలిపారు. వైద్య శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తామని అన్నారు. గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌కు బాసటగా నిలవాలి

ఉయ్యూరు: ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బాసటగా నిలవాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయులు జోగి రాజీవ్, రోహిత్‌లు కోరారు. మండలంలోని చిన ఓగిరాల గ్రామంలో రాజీవ్, రోహిత్‌లు మంగళవారం విస్తృతంగా పర్యటించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా ప్రభుత్వాన్ని ఆదరించాలని, తన తండ్రి జోగి రమేష్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చీలి కల్పన, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, పార్టీ మండల అధ్యక్షుడు దాసే రవి, ప్రధాన కార్యదర్శి గారపాటి నాని, నాయకులు పొలడుగు శివజ్యోతి, సీతారామయ్య, కొడాలి నాగేశ్వరరావు, మత్తె భాను, రాంబాబు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



చినఓగిరాలలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మంత్రి జోగి రమేష్ తనయులు రాజీవ్, రోహిత్

అభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు దాత వీరం జ్యోత్స్న, శశాంక్ దంపతులు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈఓ కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చోడవరంలో వ్యక్తి మృతి

పెనమలూరు: చోడవరం గ్రామంలో పొరపాటున మద్యంలో కలుపు నివారణ మందు కలిపి తాగి వ్యక్తి మృతి చెందిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం చోడవరం గ్రామంలో మాలావతు బాలయ్య(50) వ్యవసాయ కూలీగా పని చేస్తాడు. రాత్రి సమయంలో గ్రామంలోని రైస్‌మిల్లు వద్ద సెక్యూరిటీ గార్డుగా ఉంటాడు. కాగా సోమవారం ఉదయం మద్యంలో పొరపాటున నీరు అనుకుని కలుపు మందు కలుపుకొని తాగాడు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు మురళి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాట శిబిరంపై దాడులు

కంకిపాడు: పేకాట శిబిరంపై పోలీసులు అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. ఎస్సై డీ సందీప్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కుందేరు గ్రామ శివారు పంట పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో సోమవారం అర్ధరాత్రి సమయంలో ఆ శిబిరంపై దాడులు జరిపారు. దాడుల్లో ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 12,050 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై గేమింగ్ యాక్టు కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

ఇళ్ల స్థలాలపై పూర్తి హక్కులు

- రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు
- మంత్రి జోగి రమేష్

పెనమలూరు: రాష్ట్రంలోని పేదప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ప్రభుత్వ సొమ్ముతో రిజిస్ట్రేషన్ చేయించి పూర్తి హక్కులు కల్పించారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ సమన్వయ కర్త జోగి రమేష్ అన్నారు. పోరంకిలో మంగళవారం తాడిగడప, పోరంకి గ్రామాలకు చెందిన దాదాపు 2,100 మంది మహిళలకు రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రమేష్ మాట్లాడుతూ సీఎం జగనన్న రాష్ట్రంలో 31 లక్షల మంది మహిళలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి చరిత్ర సృష్టించారని తెలిపారు. అక్కాచెల్లెమ్మల చేతికి రూ. 10 నుంచి రూ. 15 లక్షల విలువ చేసే ఆస్తి అప్పగించామన్నారు. తోబుట్టువులు సైతం ఇవ్వని కానుక జగనన్న ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలో నేటికి 17 వేలకు పైగా జగనన్న కాలనీలు నిర్మాణం జరిగాయన్నారు. తిరిగి వైఎస్ జగన్‌ను సీఎంను చేస్తే వచ్చే రోజుల్లో ప్రతీ లబ్ధిదారుడు తన సొంత ఇంటికి గృహప్రవేశం చేస్తారని పేర్కొన్నారు.

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తోడుదొంగలు..

రాష్ట్రంలో తోడుదొంగలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ వస్తున్నారని వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని మంత్రి జోగి రమేష్ హెచ్చరించారు. ఇళ్ల స్థలాలు ఇస్తే కోర్టు కేసులు వేయించారని అన్నారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలను అమలు చేస్తే పప్పుబెల్లాలా పంచుతున్నాడని విషం కక్కారని ఆరోపించారు. తోడుదొంగలు ఇద్దరూ ఇప్పుడు ఇంటికి కిలో బంగారం, కారు ఇస్తామని వస్తున్నారని వారిని మహిళలు తిప్పకొట్టాలని కోరారు. తాను సొంత నిధులతో పేదలకు భోజనం పెడుతుంటే రామోజీరావు, రాధాకృష్ణకు కడుపు మండి తప్పుడు రాతలు రాయిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు పీ రాఘవరావు, ఈడే చాముండేశ్వరి, రామినేని రమాదేవి, నియోజకవర్గ పరిశీలకుడు రామసుధీర్, వైఎస్సార్ సీపీ నేతలు అన్నే చిట్టిబాబు, కాకి శ్రీనివాసరావు, షేక్‌చిన్నా, మున్నంగి అర్జున్‌రెడ్డి, ఆకునూరు మాణిక్యం, శ్రీహరిరాణి, కిషోర్, జిన్నా పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి జోగి రమేష్

నున్నలో రైతు భరోసా కేంద్రం నిర్మాణం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో సచివాలయం-3 వద్ద రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఉండే విధంగా రైతు భరోసా కేంద్రాన్ని నిర్మిస్తోంది. రూ. 21.80 లక్షలతో రైతుభరోసా కేంద్రం నిర్మాణ పనులు జరుగుతున్నాయని పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ ఎన్.శివరామకృష్ణ తెలిపారు. నున్నలో ఇప్పటికే రెండు రైతుభరోసా కేంద్రాలను ప్రభుత్వం నిర్మించడం జరిగిందని, మూడవ కేంద్రం కూడా నిర్మిస్తున్నట్లు ఆయన చెప్పారు. గ్రామంలోని రైతులకు వ్యవసాయ అవసరాలు, సూచనలు, సలహాలతోపాటు, ఈకేవైసీ నమోదు, విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లు నిర్వహించడానికి రైతుభరోసా కేంద్రం ఉపయోగపడనుంది.



నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రం

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం

గన్నవరం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా బూత్ కమిటీలు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ అనగాని రవి సూచించారు. స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి బూత్ కమిటీలు, సచివాలయ కన్వీనర్లు, ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్ద ఎత్తున్న సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధి గురించి వివరించాలని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి రామిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పనితీరు పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. అయినప్పటికి ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. ఈ కుట్రలను తిప్పి కొట్టడంతో పాటు ప్రజలకు వాస్తవాలు వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జలసూత్రం రామ్మోహన్‌రావు, జేసీఎస్ కన్వీనర్లు కైలే శివకుమార్, వింత ఆదినారాయణరెడ్డి, పార్టీ నేతలు పడమట సురేష్, కొల్లి రాజశేఖర్, ఎస్‌కేఎంఎంఏ కలాం తదితరులు పాల్గొన్నారు.



వేదికపై మాట్లాడుతున్న ఎంపీపీ రవి, పార్టీ నేతలు

జస్టిస్ అరుణ్ మిశ్రాకు ఘన స్వాగతం

గన్నవరం: జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ అరుణ్ మిశ్రాకు మంగళవారం గన్నవరం విమానాశ్రయంలో అధికారులు ఘన స్వాగతం పలికారు. బుధవారం జరగనున్న ఓపెన్ హియరింగ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన న్యూఢిల్లీ నుంచి విమానంలో ఇక్కడికి చేరుకున్నారు. చైర్‌పర్సన్‌తో పాటు సభ్యులు డాక్టర్ డీఎం మూలే, రాజీవ్ జైన్, సెక్రటరీ జనరల్ భరత్‌లాల్, రిజిస్ట్రార్ సురాజిత్ డే, డీఐజీ పాటిల్ కేతన్ బలిరాం, డెప్యూటీ రిజిస్ట్రార్ ఇంద్రజిత్‌కుమార్, కోర్టు మాస్టర్ డీబీ షాజీ వచ్చారు. జస్టిస్ అరుణ్ మిశ్రా బృందానికి జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం. లక్ష్మీకాంతరెడ్డి, ప్రోటోకాల్ అధికారి జవహర్, లైజన్ అధికారి కిరణ్మయి తదితరులు స్వాగతం పలికారు.



జస్టిస్ అరుణ్ మిశ్రాకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

గురుకుల ప్రవేశానికి హాల్ టికెట్లు సిద్ధం

గన్నవరం రూరల్: విద్యార్థులు గురుకుల ప్రవేశానికి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మీ సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మార్చి 10వ తేదీన నిర్వహించే ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షకు హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని డౌన్‌లోడ్ చేసుకుని వాటితో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని ఐదో తరగతి విద్యార్థులు ఉదయం ఎనిమిది గంటలకు, ఇంటర్మీడియట్ విద్యార్థులు మధ్యాహ్నం ఒంటి గంటకు వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో హాజరు కావాలని చెప్పారు. వెబ్‌సైట్ అడ్రస్సు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూడాట్‌ఏపీసీఎఫ్ఎస్ఎస్‌డాట్‌ఇన్‌లో చూసుకోవాలన్నారు.